క్లుప్తంగా

ఎస్‌ఎంసీ ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఎస్‌ఎంసీ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎంపీఈఓ ఎ.నాగరాజు కోరారు. బుధవారం కె.గంగవరం ఎమ్మార్సీలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న ఎన్నికలు జరుగుతాయన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనాలని తెలిపారు. దీంతో పాటు ఎన్నికలకు సంబంధించిన విధి విధానాలను ఆయన వివరించారు. హెచ్‌ఎంలు ఎం.పుల్లయ్య, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఆర్‌కే సత్యరామ్, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు దాణా అందజేస్తున్న ఏడీ రామకృష్ణ తదితరులు

కె.గంగవరం: శేరిలంక గ్రామంలో బుధవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఉచితంగా పశువుల దాణాను పంపిణీ చేశారు. గ్రామంలోని 82 మంది పాడి రైతులకు సంబంధించిన 336 పశువులకు 10 టన్నుల సమీకృత దాణాను రామచంద్రపురం ఏడీ ఓ.రామకృష్ణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా లంకల్లో ఉన్న పశువులకు మేత దొరకకపోవడంతో ప్రభుత్వం రైతులకు ఉచితంగా సమీకృత దాణాను అందిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ సకాలంలో స్పందించి పాడి రైతులకు దాణాను సమకూర్చారన్నారు. సర్పంచ్ కొండేపూడి భద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, టిక్ కేర్ డాక్టర్ సురేష్‌బాబు, పశు వైద్యులు కృష్ణార్జున్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కాశీ విశ్వేశ్వరరావు, చైతన్య, శంకర్ శివ పాల్గొన్నారు.


ఉపాధ్యాయ వృత్తితో సమాజంలో గుర్తింపు



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ అబ్బు తదితరులు

కపిలేశ్వరపురం: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో మంచి గుర్తింపు ఇస్తుందని కపిలేశ్వరపురం కోరాటి వారివీధి ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎం బంటుమిల్లి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. స్థానిక పాఠశాలలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. ముఖ్య అతిథి జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు శీలం గోవింద్, గొల్లపల్లి సోనియా, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, ఏపీ ఎన్జీవోస్ మండపేట విభాగం అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తిరుకోటి రమష్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యిల్లూరి సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకంబరిగా రావులమ్మ



జి.అగ్రహారంలో శాకంబరిగా రావులమ్మ తల్లి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలోని రావులమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. వేద పండితులు మండ లక్ష్మీనరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం మహిళలు 108 నదీ జలాల కలశాలతో ఊరేగింపుగా అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం చేశారు.

పదిపదే చెబుతున్నా..!

- రూ.పది నాణేలు చెల్లవంటూ పుకార్లు
- తీసుకునేందుకు వ్యాపారుల నిరాకరణ
- బ్యాంకుల్లోనూ తీసుకోక ఇబ్బందులు
- జనానికి వీడని సందేహాలు



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురానికి చెందిన రమేష్ ఓ హోటల్‌లో టిఫెన్ చేసి రూ.పది నాణేలను నాలుగు ఇచ్చి వెళ్లిపోతుండగా, ఆ యజమాని ఆపి ఈ నాణేలు చెల్లవంటూ తిరిగి ఇచ్చేశాడు. దీంతో చేసేది లేక అతను ఫోన్‌పే ద్వారా తిన్న టిఫెన్‌కు సొమ్ము చెల్లించాడు. ఇలా రమేష్‌కే కాదు నిత్యం అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. రోజు రోజుకూ రూ.పది నాణేలపై ప్రజలకు సందేహాలు పెరిగిపోతున్నాయి. వీటి చెలామణి దాదాపు తగ్గిపోతోంది. రామచంద్రపురం నియోజకవర్గంలో అయితే ప్రజలు అసలు రూ.పది నాణేల చెలామణిని దాదాపు బంద్ చేశారు. 'పది నాణేల చెలామణిపై ఎటువంటి అనుమానం లేదు. నిరభ్యంతకరంగా వాటిని తీసుకోవచ్చు' అని రిజర్వు బ్యాంకు, అధికారులు పదే పదే చెబుతున్నా ప్రజల్లో మాత్రం సందేహాలు వీడడం లేదు. 'పదుగురాడు మాట పాడియై వర్ధిల్లు..' అన్న చందంగా పది నాణేలు చెల్లవని కొందరు, నకిలీ నాణేలు ఉన్నాయంటూ మరికొందరు చేస్తున్న పుకార్లు నిజమని భావిస్తూ పలువురు వ్యాపారులు 10 నాణేలను తిరస్కరిస్తున్న తీరుతో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. వీటిని ఏదోకలా వదిలించుకునేవారు కొందరైతే, చెలామణీ చేయలేక 'పది'లంగా దాచుకుంటున్న వారు ఇంకొందరు.

నాణేల చెల్లు'పాట్లు'

రిజర్వు బ్యాంకు అధికారులు రూ.పది నాణేలు చెల్లుబాటు అవుతాయని ప్రకటన చేసినప్పటికీ మార్కెట్‌లో దుకాణదారులు వాటిని తీసుకోవడానికి ససేమిరా అంటున్నారు. నిరక్షరాస్యులే కాదు విద్యావంతులు, ఉన్నత వర్గాల సైతం అదే ధోరణిలో ఉన్నారు. తొమ్మిదేళ్ల కిందట రూ. 5 నోట్లు చెల్లవంటూ ప్రచారం జరిగింది. దీంతో అప్పట్లో ఎవరూ రూ. 5 నోటు తీసుకునేవారు కాదు. అయితే అనంతర కాలంలో రూ. 5 నోట్లు కొత్తవి రిజర్వు బ్యాంకు విడుదల చేయడంతో యథాతథంగా తీసుకుంటున్నారు. రూ. 10 నాణేలను నాలుగు రకాలుగా రిజర్వు బ్యాంకు విడుదల చేసింది. అయితే తొలి రోజుల్లో వీటిపై పుకార్లు షికారు చేశాయి. ప్రస్తుతం అసలు పది రూపాయల నాణేలు చెల్లవంటూ కొందరు, నకిలీలు ఉన్నాయంటూ కొందరు ప్రచారం చేస్తుండటంతో వ్యాపారులు తీసుకోవడానికి నిరాకరిస్తుండటంతో ప్రజలు వాటిని ఏం చేయాలో తికమకపడుతున్నారు. దీనికి తోడు బ్యాంకుల్లో రూ.పది నాణేల నిల్వలు ఉండటంతో వారు కూడా ఖాతాదారుల నుంచి తీసుకోక బయట పుకార్లకు మరింత బలం చేకూరుతోంది. నాణేలు తీసుకోని వారిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి సామాన్యులది. ఒక పక్క వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రూ. 10 నాణేలు చెల్లుబాటు అవుతాయని రిజర్వు బ్యాంకు ప్రకటనలు ఇస్తున్నా, సీనియర్ నటులు తనికెళ్ల భరణి, ప్రకాశ్‌రాజ్ వంటి వారితో సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నా క్షేత్రస్థాయిలో వ్యాపారులు పుకార్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

బ్యాంకుల్లో నిరాకరించడంతో..



బ్యాంకుల్లో కూడా రూ. 10 నాణేలను తిరస్కరిస్తున్నారు. ఎందుకని అడిగిన వారికి బ్యాంకులో రూ.10 నాణేలు అధిక మొత్తంలో ఉన్నాయని చెబుతున్నారు. నకిలీ నాణేలు ఉండటం వల్లే బ్యాంకుల్లో కూడా తీసుకోవడం లేదన్నట్టుగా అనుకుంటూ కొందరు మరింత ప్రచారం కల్పిస్తున్నారు.

– కొమ్మిశెట్టి కామేశ్, వ్యాపారి, ద్రాక్షారామ

పీఎంపీ సంఘ మండల కార్యదర్శిగా రవి



నూతన కార్యవర్గ సభ్యులతో అసోసియేషన్ నాయకులు

మండపేట: పీఎంపీ అసోసియేషన్ మండల కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఇరవాడ రవికుమార్, సహాయ కార్యదర్శిగా కేశవరానికి చెందిన పెదపాటి విష్ణు నియమితులయ్యారు. పీఎంపీ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక గుమ్మిలేరు రోడ్డులోని సూర్యా గ్రాండ్ ఫంక్షన్ హాల్లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులుగా రవిని, విష్ణును ఎన్నుకున్నట్టు సత్యనారాయణ తెలిపారు. అలాగే ఏడేళ్లుగా కార్యదర్శిగా సేవలందించిన మారిశెట్టి సత్యనారాయణను సభ్యులంతా సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన ఎముకల వైద్య నిపుణులు సాయి తేజస్వి, క్రాంతి ఎముకల సాంద్రత, కీళ్ల నొప్పులపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ సాయి తేజస్విని (బీపీటీ) ఫిజియో థెరపీ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బల్లా వెంకటరమణ, మండల కోశాధికారి వానపల్లి కనకరాజు, యిరవాడ ఏడుకొండలు, రెహ్మాన్, మేకా రామకృష్ణ, పీఎంపీలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ప్రసాద్ తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లో మరమ్మతులు తదితర పనుల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు, పల్లిపాలెం, తిప్పరాజుపాలెం, అయితపూడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు సరఫరా ఉండదన్నారు. రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శీలం యేసురాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ద్రాక్షారామ, తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం, వెలంపాలెం, నెలపర్తిపాడు, జగన్నాయకులపాలెం, తాళ్లపాలెం, వెల్ల, వెల్లసావరం, ఏరుపల్లి, కందులపాలెం, హసన్‌బాద, ఉండూరు, కాపవరం, తాడిపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

అంతర్వేదిలో సమగ్రశిక్షా స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామివారికి బుధవారం సమగ్ర శిక్షా స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ (విజయవాడ) కె.పల్లేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఫైనాన్స్, అక్కౌంటెంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మున్సిపల్ డీఈ దుర్గాప్రసాద్ మృతికి నివాళి అర్పిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు

రామచంద్రపురం: రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 4.28 కోట్ల సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ముందుగా ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మున్సిపల్ డీఈ దుర్గాప్రసాద్‌కు నివాళి అర్పించారు. అనంతరం అజెండాలోని 13 అంశాలకు గాను 9 అంశాలను ఆమోదించగా, ఒక అంశాన్ని వాయిదా వేశారు. రెండు అంశాలను తిరస్కరించారు. మరో అంశాన్ని సీడీఎంఏ ఆమోదించిన తరువాత కౌన్సిల్ ఆమోదించాలని ప్రతిపాదించారు. మున్సిపాలిటీలో వర్కర్ల నియామకాన్ని కౌన్సిల్ సభ్యులు తప్పుపడుతూ తిరస్కరించారు. రెవెన్యూ విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై సిబ్బందిని నియమించుకునేందుకు సీడీఎంఏ అనుమతి తీసుకుని కౌన్సిల్ ఆమోదానికి పెట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, మున్సిపల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ సూచించారు. ఈ అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కమిషనర్ బి.శ్రీనివాసులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణకు కృషి చేయాలి



పీఠంలో మాట్లాడుతున్న హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవరయ్య

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని రాజరాజేశ్వరీ పీఠంలో హిందూ దేవాలయాలు, వాటి పరిరక్షణ అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. రాజరాజేశ్వరి పీఠాధిపతి, మాస శివరాత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు తాళ్ల సాంబశివరాజు గురూజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలు ఉన్నతమైన జీవన సంస్కృతికి ప్రతీకలు అని అన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. సాంబశివరావు గురూజీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం, దీని చుట్టూ ఉన్న నక్షత్ర దేవాలయాల గురించి వివరించారు. హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టి.తులసమ్మ, గోవధకు వ్యతిరేకంగా పాటుపడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడు జె.వీరభద్రరావు, భజరంగ దళ్ జిల్లా కన్వీనర్ తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగికి వీడ్కోలు సన్మానం



వలీ దంపతులను సత్కరిస్తున్న తపాలా ఉద్యోగులు

మండపేట: మండలంలోని ద్వారపూడి పోస్టాఫీసులో డాక్ సేవక్‌గా బుధవారం రిటైరైన ఎస్‌కే నాజర్ వలీని సహోద్యోగులు ఆ పోస్టాఫీసులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఏలూరు డివిజనల్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘ కార్యదర్శి ఎస్‌కే బాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సబ్ పోస్టుమాస్టర్ పి.క్రాంతి అధ్యక్షతన వలీ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ముంచెత్తారు. రాజమహేంద్రవరం వెస్ట్ ఏఎస్‌పీ ఎన్‌వీ రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజునే బెనిఫిట్స్ అన్ని అందజేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం డివిజనల్ యూనియన్ కార్యదర్శి పి. భూలోకం మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు వై.స్వర్ణన్ రాజు, ఎస్‌వీవీ మునేశ్వరరావు, వై.కామేశ్వరి, గుండ్రోతు రామకృష్ణ, పి. వీరయ్యచౌదరి, సుమంత్, విశ్రాంత పోస్టుమాస్టర్ సుభద్ర, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సప్లయర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



సప్లయర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

మండపేట: మండలం, మండపేట పట్టణంలోని శ్రీనివాస సప్లయి, లైటింగ్, సౌండ్ డెకరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక జొన్నల శేషాయమ్మ, అబ్బులు కాపు కల్యాణ మండపంలో జరిగింది. అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అద్దేపల్లి నాగరాము, ఉపాధ్యక్షుడిగా కాదా సురేష్, కార్యదర్శిగా మేడిశెట్టి వెంకట సాయిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సహ కార్యదర్శిగా కందుల అన్వేష్, కోశాధికారిగా చెల్లూరి కుమారస్వామి, సహ కోశాధికారిగా వల్లెం తాతాజీలను ఎన్నుకున్నారు. పెండ్యాల సత్యనారాయణను గౌరవ సలహాదారుడిగా నియమించారు. కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నాయకులు హాజరయ్యారు.

అప్పనపల్లిలో దర్శనాలు పునరుద్ధరణ

మామిడికుదురు: గోదావరి వరదల కారణంగా ఏడు రోజుల నుంచి నిలిపివేసిన అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దర్శనాలను బుధవారం నుంచి పునరుద్ధరించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. వరద ఉధృతి కారణంగా ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురి కాకూడదన్న కారణంతో 24వ తేదీ బుధవారం నుంచి దర్శనాలను నిలిపివేశారు. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గమైన అప్పనపల్లి కాజ్‌వే ముంపు బారిన పడడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో దర్శనాలను పునరుద్ధరించారు. ఆలయంలో దర్శనాలు, నిత్య కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయి.

ఘనంగా వేద పండిత సత్కార సభ

రాజోలు: రాజోలు తాలూకా వేదశాస్త్ర పరిషత్ పండిత సత్కార సభ బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక శివాలయ ప్రాంగణంలోని మహాన్యాస మండపంలో పురోహితుడు కడియాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో భీమవరం మావుళ్లమ్మ తల్లి ఆలయ వేద పండితుడు యావని వెంకట రామచంద్ర సోమయాజి ముఖ్య అతిథిగా పాల్గొని 'వైదిక ధర్మం లోక హితం' అనే అంశంపై ప్రవచించారు. 27వ రాజోలు తాలూకా స్మార్త, ఆగమ, అపర పండితులను ఘనంగా సత్కరించారు. వైష్ణవాగమన గురించి అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్, అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నాగ వెంకట చంద్రసూర్యకుమార్ శైవాగమం గురించి తెలిపారు.

పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ



దాణా అందజేస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

కపిలేశ్వరపురం: వరదల నేపథ్యంలో మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. పశు సంవర్థక శాఖ ఆలమూరు ఏడీ ఎల్.అనిత పర్యవేక్షణలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, నాయకులు రంకిరెడ్డి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా దాణా పంపిణీ చేశారు. వరద వీడిన నేపథ్యంలో పశువుల సంరక్షణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అనిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజాప్రతినిధులు, పశు సంవర్థక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి



గొల్లపాలెంలో జేసీబీతో తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

కాజులూరు: పారిశుధ్య నిర్వహణపై ప్రజలు శ్రద్ధ వహించాలని గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. బుధవారం గొల్లపాలెంలో స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది రహదారుల వెంబడి ఉన్న తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెదురుమదురుగా వర్షాలతో పారిశుధ్య సమస్య కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలు సిబ్బందికి సహకరించాలన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు అంగర శ్రీనివాస్ గౌడ్, రేఖపల్లి సత్తిబాబు, పెంటపాటి శ్రీను, వనమాడి కొండబాబు, మండల గౌడ సంఘ అధ్యక్షుడు అంగర కృష్ణ, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ఏకాగ్రత అవసరం



కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో మొక్కను నాటుతున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

కాజులూరు: విద్యార్థులు ఏకాగ్రతతో చదివినప్పుడే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని రామచంద్రపురం డీవైఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి తరగతి గదుల్లో విద్యార్థులకు లక్ష్యాలను నిర్దేశించడంపై పలు సూచనలు చేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ సాధించిన నలుగురు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, అన్యం శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేరు మాత్రమే మార్పు

- నరకులన్నీ వైఎస్ జగన్ హయాంలోనివే
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్థానంలో బాల సంజీవని కిట్
- నేటి నుంచి 8 వరకూ తల్లిపాల వారోత్సవాలు
- కార్యాచరణకు సన్నద్ధమవుతున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: ప్రభుత్వం మారిందంటే పాలకుల నుంచి ప్రజలు మరింత ప్రయోజనాలను ఆశించడం సహజం. అప్పటికే ఉన్న పథకాల స్థానంలో మరిన్ని పథకాలను ప్రారంభించాలని, ఉన్న పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయాలని కోరుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ పాలన అందుకు భిన్నంగా సాగుతోంది. వైఎస్ జగన్ హయాంలో అమలు చేసిన పథకాల పేర్లు మార్చడం మాత్రమే తప్ప పథకాల సారాన్ని పటిష్ట పరిచే కృషి ఏమాత్రం జరగడం లేదు. గురువారం నుంచి ప్రారంభం కానున్న తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలోనూ అదే జరుగుతోంది.

అంగన్‌వాడీల వేదికగా వారోత్సవాలు

జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం మండలంలో 78, రాయవరం మండలంలో 70, మండపేట పట్టణం, రూరల్ మండలంలో 94 మొత్తం 242 కేంద్రాలున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలోని మండలాలవారీగా కాజులూరులో 80, కె.గంగవరంలో 78, రామచంద్రపురం పట్టణం, మండలంలో 105, మొత్తం 263 కేంద్రాలున్నాయి. రెండు నియోజకవర్గాల్లో 505 కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మండపేట నియోజకవర్గంలో సుమారుగా 1,123 మంది బాలింతలు, 1,234 మంది గర్భిణులు, 5,034 మంది 6 నెలల నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలు, 4,654 మంది మూడు నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులు ఉన్నారు. వారందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు.

వారోత్సవాల లక్ష్యమిదీ..

బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు కీలకం. తల్లిపాల ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలు, వారి సంరక్షకులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్, జాతీయ సంస్థలు వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖలు సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమాల్లో తక్కువ ఖర్చుతో పౌష్టికాహారాన్ని సమకూర్చుకొనే, ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకొనే పద్ధతులు వివరిస్తారు. తల్లిపాలు పట్టడం ద్వారా బిడ్డకు మాంసకృతులు, విటమిన్లు తదితర సకల పోషక విలువలూ సమృద్ధిగా లభ్యమవుతాయి.



2023లో నేలటూరులో సంపూర్ణ ఆహార కిట్లతో గర్భిణులు, బాలింతలు (ఫైల్)

అదొక్కటే మార్పు

వైఎస్ జగన్ పాలనలో ఐదేళ్లు విద్య, వైద్యం, ఆరోగ్యాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య కిట్ పేరుతో గర్భిణి, బాలింతలకు 10 రకాల బలవర్ధక ఆహార పదార్థాలను టేక్ హోమ్ రేషన్ పేరుతో రూ.1,500 నుంచి రూ.1,700 విలువైన పోషకాహారాన్ని అందజేసేది. అంగన్‌వాడీలు ఇంటికి తీసుకెళ్లి అందజేసేవారు. నెలకు రాగిపిండి, అటుకులు కేజీ చొప్పున, ఎండు ఖర్జూరం పావు కిలో, బెల్లం పావుకిలో, 25 కోడి గుడ్లు, గర్భిణి, బాలింతలకు 5 లీటర్లు, చిన్నారులకు 3 లీటర్లు చొప్పున పాలు క్రమం తప్పకుండా అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవే పదార్థాలను అందజేస్తూ పథకం పేరును బాల సంజీవనిగా మార్చింది.

అవగాహన కల్పించే లక్ష్యంతో..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తల్లిపాల ప్రాధాన్యతపై గర్భిణులు, బాలింతల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆ దిశగా వారిని ప్రోత్సహించమని వారి సహాయకులను కోరుతున్నాం. వైద్య, ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– అధికారి గజలక్ష్మి, సీడీపీఓ, కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు